క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన కోటపాడు విద్యార్థిని


పచ్చిపాల మౌనిక లక్ష్మీ ప్రియ

రంగంపేట: మండలంలోని కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని పచ్చిపాల మౌనిక లక్ష్మీప్రియ నేషనల్ మెరిట్స్ అండ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ.2 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు ఈ ఉపకారం వేతనం ఆమెకు అందుతుందన్నారు. ఈ సందర్భంగా మౌనిక లక్ష్మీప్రియను పాఠశాల కమిటీ, విద్యా కమిటీ, నాయకులు తదితరులు అభినందించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

అనపర్తి : మండలంలోని పొలమూరు గ్రామం తూర్పు పేటలో కొలువై ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. రామచంద్రపురానికి చెందిన విశ్వబ్రాహ్మణ పురోహితులు బ్రహ్మశ్రీ అత్తిలి శివరామకృష్ణ, కొడమంచిలి సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో మానేపల్లి వీరబ్రహ్మం, ఝాన్సీలక్ష్మీ దంపతులతో స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ ఐ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ప్రతిభను కనబర్చారని వారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 110 మందికి 108 మంది పాసవడంతో 98 శాతం ఉత్తీర్ణతను, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరైన 31 మంది ఉత్తీర్ణులై నూరుశాతం ఫలితాలు సాధించారన్నారు. మొదటి సంవత్సరం జనరల్‌లో 165 మందికి 131 మంది, ఒకేషనల్‌లో 67 మందికి 56 మంది ఉత్తీర్ణులై 79 శాతం ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమైనట్టు తెలిపారు. విద్యార్థులకు నోట్ బుక్స్, టెక్ట్ బుక్స్ ఉచితంగా ఇస్తామన్నారు.

50 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట: మండలంలోని సారా తయారీ నిందితులను అరెస్టు చేసినట్లు రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. శనివారం మండలంలోని దొంతమూరులో దాడులు నిర్వహించగా 50 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు.1,800 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బుక్కచక్రవర్తి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. గండి సూర్యనారాయణపై కేసు నమోదు చేశామన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి తిరు కల్యాణోత్సవం


సీతానగరంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణు గోపాలస్వామి కల్యాణోత్సవం

సీతానగరం: స్థానిక విష్ణు ఆలయంలో వేణుగోపాలస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మద్దూరి నాగార్జున శర్మ, ప్రధాన అర్చకులు వేదాంతం కేశవచార్యుల ఆధ్వర్యంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి 10.30 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. ఏటా జ్యేష్ఠమాస, శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో పాటి సత్యనారాయణ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ఆటో


బూరుగుపూడిలో ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టి నుజ్జయిన ఆటో

కోరుకొండ: ఆగి ఉన్న టిప్పర్‌ను ప్రయాణికులను తరలిస్తున్న ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలుకాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కోరుకొండ మండలం బూరుగుపూడి కొత్తూరులో శనివారం ఈ ప్రమాదం జరిగింది. రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వైపునకు వెళుతూ డ్రైవర్ టిప్పర్‌ను రోడ్డు పక్కన ఆపారు. వెనుక వేగంగా వస్తూ ఆటో టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జయ్యింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు.

ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు !

- మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే ఎన్నికలలో హామీ
- అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా తాత్సారం
- సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడని ప్రశ్నిస్తున్న ప్రజలు
- మోసపోయామంటూ మహిళల గగ్గోలు


సీతానగరం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పల్లె వెలుగు బస్సు

సీతానగరం: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చంటూ కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. గద్దెనెక్కి ఏడాది పూర్తయినా హామీలను పట్టించుకోవడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం అమలు ఇంకెప్పుడని మహిళలు ప్రశ్నిస్తున్నారు. తమిళనాడులో ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచో అమలులో ఉంది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తక్షణమే ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు కల్పించారు. మన రాష్ట్రంలో టీడీపీ కూటమి నేతలు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

రాజానగరం నియోజకవర్గంలో మహిళలు 1,38,365 మంది ఉండగా వారిలో 1,09,472 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

మహిళా ఓటర్ల సంఖ్య అధికం

రాజానగరం నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 2,719 మంది ఎక్కువగా ఉన్నారు. రోజుకు సగటున 40 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ టీడీపీ, జనసేన కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా గెలుపొందిన అనంతరం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు తాత్సారం చేస్తున్నారు.

స్పష్టత కరవు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు కనీసం స్పష్టత ఇవ్వడం లేదు. రోడ్డు రవాణ శాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడం తప్ప, ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. తొలుత గతేడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని ప్రకటించారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికి తోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాము కాని వాటిని అమలు చేయాలంటేనే భయమేస్తోందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూర్చింది. కూటమి ప్రభుత్వం అరకొరగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చి మమ అనిపించారు. ఎండీయూ వాహనాలను నిలిపివేసి రేషన్ దుకాణాల వద్ద సరుకులు తీసుకోవాలని ఓట్లు వేసిన ప్రజలకు ఝలక్ ఇచ్చారు. ఇదే కోవలో ఉచిత బస్ ప్రయాణం ఉంటుందా అని మహిళలు అనుమానపడుతున్నారు

మహిళా ఓటర్ల వివరాలు

మండలం	మహిళల సంఖ్య	మహిళా ఓటర్లు
సీతానగరం	38,937	30,056
కోరుకొండ	44,588	33,013
రాజానగరం	54,840	46,403

హామీలన్నీ అమలు చేయాలి



మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన తక్షణం ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. ఇక్కడ ఎందుకు చేయలేకపోతున్నారు. తక్షణమే ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి. పలు రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు అధికారం చేపట్టిన తక్షణమే ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు.

– దొక్కా నాగమణి, మిర్తిపాడు

మహిళలంతా మోసపోయారు



ఎన్నికల ముందు హామీలు ఇచ్చేటప్పుడే వాటి ఆచరణకు సంబంధించిన ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుని చంద్రబాబు ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. టీడీపీకి ఓటు వేసి మహిళలంతా మోసపోయారు. సూపర్ సిక్స్ హామీలన్నీ త్వరితగతిన అమలు చేయాలి. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు కల్పించాలి.

– గుర్రాల జ్యోత్స్న, ఎంపీపీ, ముగ్గళ్ల

షైనింగ్ స్టార్ అవార్డుకు రంగంపేట విద్యార్థి ఎంపిక


రంగంపేటలో విద్యార్థి శ్యామ్ కుమార్ అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: మండలంలోని రంగంపేట శ్రీ ఉండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కోశెట్టి శ్యామ్‌కుమార్ షైనింగ్ స్టార్ అవార్డు–2025కు ఎంపికైనట్టు హెచ్‌ఎం వి.పార్థసారధి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్యామ్‌కుమార్ పదో తరగతి ఫలితాల్లో 584 మార్కులు సాధించాడన్నారు. రంగంపేట మండలం నుంచి ప్రతిభ అవార్డుకు ఎంపిక కావడం హర్షనీయమని పలువురు అభినందించారు. జూన్ 9న రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో షైనింగ్ స్టార్ అవార్డును శ్యామ్‌కుమార్ కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా అందుకుంటారని ఆయన తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెదపూడి: సంపర గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తులసి దళాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గ్రామాల్లో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర


రంగంపేటలో సత్య సాయిబాబా ప్రేమ ప్రవాహిని రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రంగంపేట/ రాజానగరం : భగవాన్ సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా జిల్లాలో మూడు రోజుల పాటు సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నిర్వహించనున్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వేంకటేశ్వర్లు శనివారం వివరాలు వెల్లడించారు. శనివారం రంగంపేట వద్ద భగవాన్ సత్య సాయిబాబా ప్రవాహిని రథయాత్ర నిర్వహించినట్టు తెలిపారు. భగవాన్ సత్యసాయిబాబా దివ్య దర్శనాన్ని, పాదుకల నమస్కారాన్ని భక్తులకు కల్పించాలన్న లక్ష్యంతో ఈ రథయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందారని ఆయన చెప్పారు. ఈ యాత్ర శనివారం పేరారామచంద్రపురం, ముక్కినాడ,పాత వీరంపాలెం, కొత్త వీరంపాలెం, జి.దొంతమూరు, ఈలకొలను, అచ్యుతాపురం, ముకుందవరం, సుభద్రంపేట, నల్లమిల్లి, కోటపాడు, కొత్త నాగంపల్లి, పాత నాయింకంపల్లి, యల్లమిల్లి, పెదరాయవరం, చంద్రేడు, రంగంపేట, వడిశలేరు, వెంకన్నపేట మీదుగా రాజానగరం చేరుకుందన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం, సోమవారం కొవ్వూరు రథయాత్ర చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలోని కందర్ప రాంబాబు, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త ఎన్వీ సాయిరాం, ఇన్‌చార్జి టి.గోవిందరాజు, వి.సుభాష్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో రాజానగరం జట్టు విజేత


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: మండలంలోని సీతారామపురంలో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్, శ్రీను మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో రాజానగరం జట్టు విజేతగా నిలిచింది. రాజానగరం, కోరుకొండ, సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల నుంచి 32 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో శనివారం జరిగిన ఫైనల్ పోటీలో రాజానగరం, గాదరాడ జట్లు తలపడ్డాయి. విజేతగా నిలిచిన రాజానగరం జట్టుకు ట్రోఫీతో పాటు రూ.22,222, రన్నర్ గాదరాడ జట్టుకు రూ.15,555 నగదును బహుమతులను వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు, ఎంపీటీసీ సభ్యుడు నాగమల్ల పండు, నాయకులు పలివెల గోవిందు, మందాల సూర్యనారాయణ, అడబాల జగదీష్, దుర్గారావు, మేడిశెట్టి రాజు, ఆర్గనైజర్ ఆదిపాక నాగబాబు పాల్గొన్నారు.

ప్రజాపక్షాన పోరాడుతాం

- సూపర్ సిక్స్ హామీలకు చంద్రబాబు తూట్లు
- వైఎస్సార్ సీపీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


చినకొండేపూడిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: పథకాల అమలు కోసం ప్రజాపక్షాన పోరాడతామని, కక్ష సాధింపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆపార్టీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం చినకొండేపూడిలో వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు ఇంటి ఆవరణలో, పెదకొండేపూడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నా కార్యకర్తలు – నా కుటుంబం కార్యక్రమంలో జక్కంపూడి రాజా పాల్గొని పార్టీ బలోపేతం కోసం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలుకు ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి స్పందన వచ్చిందన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

పేదలకు అందని వైద్యం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకపోగా దోపిడీయే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. విద్యుత్తు చార్జీల బాదుడుతో రాష్ట్ర ప్రజలను దోచేస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ అమలు కావడం లేదని, పేదలకు వైద్యం అందక పలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యమయ్యాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ స్కామ్‌ల పాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. కూటమి పాలనలో అన్నీ మోసాలే తప్ప ప్రజలకు లబ్ధి చేకూరిందేమీ లేదని ఆక్షేపించారు.

నియోజకవర్గంలో మట్టి, ఇసుక దోపిడీ

నియోజకవర్గంలో మట్టి, ఇసుక దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. నా కార్యకర్తలు – నా కుటుంబం పేరుతో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ అక్రమాలను ఎదుర్కొంటామన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి కూటమి ప్రభుత్వ ఆగడాలను ఎదుర్కొందామని జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చేకూరి నాని, నియోజకవర్గం ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు, సర్పంచ్ చేకూరి పాల్ శ్రీనివాస్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు, ఇంద్ర, మురారీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ


కోరుకొండలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతనాలయం


నూతన ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ: వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ కోరుకొండలో వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన ఆలయం, విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు, హోమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 7.39 గంటలకు ఆలయ ప్రతిష్ఠతోపాటు స్వామివారి నూతన విగ్రహం, విమాన శిఖర, శిలా జీవ ధ్వజ మయూర, సర్పబంధ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాణింగపల్లి సత్యపవన్‌కుమార్ ఆచార్యులు, ఆగమ పండితులు ఇంద్రగంటి విశ్వనాథశర్మ, ఆలయ అర్చకులు కాళ్లకూరి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

వృద్ధాశ్రమంలో భోజనాల వితరణ

అనపర్తి : రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనపర్తి శ్రీతేతలి రామిరెడ్డి, మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు ఏపీఈపీడీసీయల్ 11 జిల్లాల షిఫ్ట్ ఆపరేటర్స్ ప్రతినిధి, డిస్కమ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కురసాల జ్యోతి కుమార్ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తేతలి నారాయణరెడ్డి, డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, తాడి చంద్రశేఖరరెడ్డి, చేవలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ విధానంపై ఉపాధ్యాయుల ఆగ్రహం


పెదపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పెదపూడి: ప్రస్తుతం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించరాదంటూ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పెదపూడి మండల విద్యా వనరుల శాఖాకార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం మాన్యువల్‌గా కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులు సమ్మంగి శ్రీరాములు, పంపన సత్యనారాయణ, జి.నాగేంద్ర ప్రసాద్, వి.పట్టాభి, కె.రమేష్, కె.వెంకటరెడ్డి, కె.రాజేష్. పి.రాజు పాల్గొన్నారు.

టీడీపీలో అంతర్గత విభేదాలు

పదవులకు రాజీనామాలు

సీతానగరం: టీడీపీలోని అంతర్గత విభేదాల బయటపడుతున్నాయి. టీడీపీకి చెందిన మండల స్థాయి నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. వంగలపూడికి చెందిన గద్దె వెంకటసురేష్ టీడీపీలో క్లస్టర్–1 ఇన్‌చార్జ్ పదవికి, మిర్తిపాడుకు చెందిన వాకలపూడి శివరామకృష్ణ గ్రామ కమిటీ అధ్యక్షుడు, 56వ బూత్ ఇన్‌చార్జ్ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న వారు ప్రస్తుతం వంగలపూడి, మిర్తిపాడు పార్టీ గ్రామ అధ్యక్షులుగా ఇరువురు బాధ్యలు నిర్వర్తిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో సమర్థవంతంగా పని చేయగలననే నమ్మకం లేదని, గ్రామాల్లో వివిధ కమిటీలకు తమను సంప్రదించకుండా ఏకపక్ష ధోరణితో తీసుకున్న నిర్ణయాలను తాము వ్యతిరేకిస్తూ రాజీనామాలు చేశామన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయానికి, నియోజకవర్గం ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరికి సామాజిక మాధ్యమాల ద్వారా, లిఖిత పూర్వకంగా తమ రాజీనామా లేఖలు పంపించినట్టు వారు తెలిపారు.

పుట్టకొండలో ఘనంగా ముగిసిన సప్తాహం


పుట్టకొండలో అన్నదానం నిర్వహిస్తున్న సప్తాహం కమిటీ ప్రతినిధులు పాల్గొన్న భక్తులు

పెదపూడి: భక్తి శ్రద్ధలతో వారం రోజుల పాటు పుట్టకొండ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద వైభవంగా సప్తాహం నిర్వహించామని సర్పంచ్ వల్లు వెంకటరమణ చెప్పారు. ఈ గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారామచంద్రస్వామి ప్రథమ సప్తాహం కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ప్రముఖ పండితులు పి.కమలాకర్, చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ ముగింపు సందర్భంగా సుమారు 4వేల మందికి గ్రామస్తులు, భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించామన్నారు. గ్రామంతోపాటు కుమారప్రియం, కైకవోలు, కాండ్రేగుల, సంపర, చింతపల్లి, గండ్రేడు తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారని తెలిపారు. గ్రామంలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన ఈ సప్తాహం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేశారని సర్పంచ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు


బిక్కవోలులో బక్రీద్ సందేశం వివరిస్తున్న ఇమామ్ మొహమ్మద్ షహజాద్ అష్రఫీ

బిక్కవోలు : మండలంలోని బిక్కవోలు, పందలపాక, బలభద్రపురంలో మసీదులలో శనివారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి సామూహికంగా నమాజు చేసి పరస్పరం ఆలింగనాలు చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు ఇళ్ల వద్ద నమాజు చేశారు. అనంతరం ఖుర్బానీలు ఇచ్చుకున్నారు. పందలపాకలో అహలె సున్నత్‌వల్ జమాత్ జామియా మసీదులో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈద్ ఉల్ అజహా బక్రీద్ జరుపుకున్నారు. ఇమామ్ షేక్ గులామ్‌గౌసీ రిజ్వి పండుగ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లో భాగంగా ఖురాన్ ప్రవచనాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సృష్టిని నియంత్రించే శక్తిని అల్లాహ్ (దైవం) అంటామని, ఆయన ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆయన కోసం త్యాగం చేసేందుకు వెనుకాడకూడదని సందేశాన్నిచ్చే పండగ బక్రీద్ అని అన్నారు. బిక్కవోలు మదీనా మస్జిద్ అంజుమన్ వద్ద ఇమామ్ మొహమ్మద్ షహజాద్ అష్రఫీ బక్రీద్ సందేశం వివరించారు.ఈ కార్యక్రమంలోని మస్జిద్ కమిటీ అధ్యక్షుడు షేక్ మహబూబ్ జానీ, ఉప అధ్యక్షులు షేక్ కాలిషా తదితరులు పాల్గొన్నారు. పందలపాక బిలాల్ మస్జిద్, అహల్లె సున్నత్ వలె జమాతే జామియా మస్జిద్‌లో ముస్లింలు అధిక సంఖ్యలో నమాజులో పాల్గొన్నారు. అనంతరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మస్జిద్‌ల వద్ద పేదలకు దాన ధర్మాలు చేశారు. కుల మతాలకు అతీతంగా ముస్లిం సోదరులకు పలువురు ఈద్ ముబారక్ తెలిపారు.

త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్

పెదపూడి: త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్ పండుగ అని పలువురు ముస్లిం మత పెద్దలు వివరించారు. శనివారం బక్రీద్ పర్వదినం సందర్భంగా మండలంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. జి.మామిడాడ, రామేశ్వరం, పెదపూడి, సంపర, పెద్దాడ తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ముస్లిం త్యాగనిరతితో ముందుకు సాగాలని మత పెద్దలు అన్నారు.

గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలి


శ్రీరామనగరంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

సీతానగరం: గ్యాస్ వాడకం – భద్రతపై జయరోహన్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని పెందుర్తి దేవదాసు, మేనేజర్ కె రఘు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం రాపాక పంచాయతీ పరిధిలో శ్రీరామనగరం పాఠశాల ఆవరణలో మహిళలకు గ్యాస్ వాడకంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ ట్యూబ్‌ను ఐదేళ్లకు ఒకసారి మార్చాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కన మరో ఫుల్ సిలిండర్ ఉంచరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు